క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఎస్పీ జగదీష్‌ను కలిసిన స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు

కంబాలచెరువు: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.అప్పారావు గురువారం ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో సమర్థంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా, అలాగే అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం సేకరించాలన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడియం: మురమండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.శ్రీధర్ వర్మ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని దుళ్ల, దామిరెడ్డిపల్లి, మాధవరాయుడుపాలెం, పొట్టిలంక, వీరవరం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

చిలుకూరికి పురస్కారం

కడియం: ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కొణతాల రామలింగస్వామి స్మారక పురస్కారం కడియం గ్రామానికి చెందిన పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత, ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావుకు దక్కింది. ఈ మేరకు సంబంధిత మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ కొణతాల లక్ష్మీపార్వతి నుంచి తనకు ఆహ్వానం అందిందని చిలుకూరి శ్రీనివాసరావు స్థానిక విలేకరులకు గురువారం తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ వివిధ రంగాల్లో నిష్ణాతులను ఎంపిక చేసి ఈ పురస్కారంతో ట్రస్టు సత్కరిస్తోందని వివరించారు. ఈ ఏడాది ఏడుగురిని ఎంపిక చేసిందన్నారు. ఈనెల 14న అనకాపల్లిలో పురస్కార ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.

నేడు నర్సరీ రైతుల సమావేశం

కడియం: వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగిస్తున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు రైతులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు తెలిపారు. కడియపులంకలోని అసోసియేషన్ ప్రాంగణంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ హాజరవుతారన్నారు. రైతులందరూ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కడియంలో జయహో బీసీ

కడియం: వైఎస్సార్ సీపీ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని టీడీపీ నాయకులు ఆరోపించారు. కడియంలో గురువారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సోలార్ హబ్‌గా తీర్చిదిద్దాం

కడియం: మండలంలోని నర్సరీలకు వెయ్యి సోలార్ కనెక్షన్లు ఇచ్చి సోలార్ హబ్‌గా తీర్చిదిద్దిన ఘనత టీడీపీదేనని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించడం హాస్యాస్పదమన్నారు.

సంతకాల సేకరణ



జేగురుపాడులో సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న సర్పంచ్ స్టాలిన్

కడియం: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల మహా శిల్పం ఏర్పాటుకు సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం మండలంలోని జేగురుపాడులో జరిగింది. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి వీరశివాజీ, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు సాకా కిరణ్, మాజీ అధ్యక్షుడు బళ్ల అన్నవరం, అంబేడ్కర్ యువజన విభాగం ప్రెసిడెంట్ మద్దుకూరి గోపి, కె.వెంకన్న, పంచాయతీ కార్యదర్శి శిరీష పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక సోమాలమ్మగుడి ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మేదరపేటకు చెందిన నోట్ల ఏసును గురువారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడ నుంచి 180 ఎంఎల్ 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వలంటీర్లకు అంతర్జాతీయ గుర్తింపు



వలంటీర్లను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- వారితోనే ప్రజలకు సత్వర సేవలు
- మంత్రి వేణుగోపాలకృష్ణ

ధవళేశ్వరం: సాటి వ్యక్తులకు సహాయం, ప్రజలకు సత్వర పౌర సేవలు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థకు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరం జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన పేదలందరి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను పారదర్శకంగా తీసుకువెళ్లేందుకు ఏర్పాటు చేసిందే వలంటీర్ వ్యవస్థ అన్నారు. ఎందరో రాష్ట్రంలో పర్యటించి ఈ సంస్కరణలను అధ్యయనం చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. పేదరికాన్ని రూపుమాపే శక్తి విద్యకు మాత్రమే ఉందని ఆలోచించిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టి ప్రతి పేద విద్యార్థికి ఇంజినీరింగ్, మెడిసిన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ తదితర ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో పేద వర్గాలకు చెందిన పిల్లలు చదువుకునేందుకు అమ్మ ఒడి వంటి ఔషధాన్ని అందించి బాల కార్మిక వ్యవస్థను రూపుమాపిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

మంత్రి వేణు మాట్లాడుతూ నాడు పేదల ఆరోగ్యానికి భరోసా అందిస్తూ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.2.50 లక్షల ఖరీదైన వైద్యాన్ని డాక్టర్ రాజశేఖరరెడ్డి అందించగా, ఆయన తనయుడిగా నేడు జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ కాన్సెప్ట్, ప్రతి గ్రామంలోనూ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేద ప్రజలకు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. రాష్ట్రంలో 2.65 లక్షల మంది వలంటీర్లను తీసుకోవడం వలన ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించడం సాధ్యమైందన్నారు. ఒకటవ తేదీన ఠంఛనుగా పెన్షన్లు ఇవ్వడం ద్వారా ప్రజల్లో వలంటీర్‌కు ప్రత్యేక స్థానం లభించిందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ మండలం ఎంపీడీవో డి శ్రీనివాసరావు, కడియం మండల ఎంపీడీవో కె.రత్నకుమారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు సంక్రాంతి సంబరాలు



31వ వార్డులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో రౌతు సూర్యప్రకాశరావు

- ఆర్ట్స్ కళాశాలలో ముగ్గుల పోటీలు
- బహుమతులుగా స్కూటీ, కాసు బంగారం, ఏసీ
- ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో భారీ ఎత్తున సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సంక్రాంతి సంబరాలు పేరిట మహిళలకు ఉదయం 10 గంటలకు రంగవల్లుల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే మూడు రోజులుగా నగరంలోని 42 డివిజన్లలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించామని, వేలమంది అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ప్రతి డివిజన్లోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మెషీన్ అందజేస్తున్నారు. శుక్రవారం నిర్వహించే మెగా రంగవల్లుల పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతిగా టీవీఎస్ స్కూటీ, ద్వితీయ బహుమతిగా కాసు బంగారం, తృతీయ బహుమతిగా ఏసీ అందజేస్తామన్నారు. పాల్గొన్న మహిళలందరికీ కన్సోలేషన్ బహుమతులు ఉన్నాయన్నారు. రంగవల్లుల పోటీలతో పాటు పతంగులు, పిండి వంటలు, గంగిరెద్దులు, హరిదాసుల సందడి ఇవన్నీ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సంక్రాంతి సంబరాలలో అత్యుత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. సంబరాల్లో భాగంగా 31వ వార్డులో నిర్వహించిన రంగవల్లుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ గుడూరి శ్రీనివాస్, మజ్జి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు, మజ్జి నూకరత్నం, పోలు విజయలక్ష్మి, రామాంజనేయులు, డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛత మన అందరి బాధ్యత



పంచాయతీ కార్మికులతో కలిసి మైదానాన్ని శుభ్రం చేస్తున్న మంత్రి వేణు

ధవళేశ్వరం: స్వచ్ఛత మన అందరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో వలంటీర్లతో సమావేశం సందర్భంగా విచ్చేసిన సమయంలో.. అపరిశుభ్రంగా ఉన్న సభా ప్రాంగణాన్ని పరిశీలించి స్వయంగా చీపురు తీసుకొని స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రత, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. అధిక సంఖ్యలో మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ మండల ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, కడియం మండల ఎంపీడీవో కె.రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, పుట్టా పరేష్‌నాథ్, నక్కా శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం



లక్ష్మం నాయుడు (ఫైల్)

కంబాలచెరువు: రెండు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి మృతదేహం గోదావరిలో లభించింది. శ్రీకాకుళానికి చెందిన లక్ష్మం నాయుడు జగ్గపేట వద్దనున్న రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అతను దానవాయిపేటలో నివాసముంటున్నాడు. అయితే ఈ నెల 8వ తేదీన అదృశ్యమయ్యాడు. దీనిపై అతడి కుటుంబ సభ్యులు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలావుండగా కాతేరు వద్ద గోదావరిలో మృతదేహం తేలియాడుతోందని గురువారం పోలీసులకు సమాచారం వచ్చింది. వారు అక్కడకు చేరుకుని పరిశీలించగా, అతడిని లక్ష్మం నాయుడుగా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా లక్ష్మం నాయుడు గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఆ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కనక మహాలక్ష్మికి విశేష పూజలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న ఎంపీ భరత్ రామ్

సీటీఆర్ఐ: కంబాల చెరువు సమీపంలోని కనక మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి గురువారం ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్ రామ్ విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయ, కరుణ ప్రతి ఒక్కరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. మార్గశిర మాసం నెల రోజులూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆలయ కమిటీ ఎంతో వైభవంగా నిర్వహించడాన్ని అభినందించారు. అనంతరం ఆలయం వద్ద ఉర్లంకల రవి, శ్యామలాదేవి దంపతుల ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు పది వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మార్కండేయేశ్వరస్వామి దేవస్థాన పాలక మండలి చైర్మన్ ఇన్నమూరి దీపు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



ధవళేశ్వరంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వేణు

ధవళేశ్వరం: శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరం బాలుర హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఏబీసీసీ ఫెస్టివల్ – జంగా జాన్సన్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, గిరజాల బాబు, బడుగు చిన్నిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ యువత క్రీడలుపై ఆకర్షితులయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఏడాదీ జంగా జాన్సన్ స్ఫూర్తిదాయకంతో వారిని స్మరించుకుంటూ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దొంతంశెట్టి వీరభద్రయ్య, ఈలి గోపాలం, తలారి వరప్రసాద్, ఎస్.సూరిబాబు, ఎన్వీ శేఖర్, బోడపాటి కుమార్, మోర్త పావనమూర్తి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి షటిల్ టోర్నీ



కడియంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ శ్రీనివాసులు

కడియం: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలోని ఇండోర్ కోర్టులో జిల్లా స్థాయి షటిల్ టోర్నీ గురువారం ప్రారంభమైంది. టోర్నీని దక్షిణ మండలం డీఎస్పీ కే.శ్రీనివాసులు ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. నాకౌట్ విధానంలో జరిగే ఈ టోర్నీలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 35 జట్లు పాల్గొంటున్నారని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తెలిపారు. ఫైనల్స్ అనంతరం జిల్లా ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలాజీ సుందరం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మనిషి మనుగడకు ప్రకృతే ఆధారం



మకర ఉత్సవ్‌లో పాల్గొన్న దుర్గాప్రసాద్ తదితరులు

సీటీఆర్ఐ: మనిషి మనుగడకు ప్రకృతే ఆధారం, అందుకు కృతజ్ఞతలు తెలపడం కోసమే పండగలు అని నర్తన రుషి డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో లలిత కళా సమితి ఆధ్వర్యంలో గురువారం మకర ఉత్సవ్ పేరుతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తల్లి వంటి తెలుగును మరువరాదని, సంప్రదాయాన్ని కూడా మర్చిపోతే మానవ జీవితానికి అర్థం ఉండదన్నారు. అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ప్రకృతిపై భక్తి భావం కలిగి ఉండాలని కోరారు. ఆంగ్ల అధ్యాపకురాలు డాక్టర్ స్వర్ణశ్రీ, లలిత కళాసమితి ఉపాధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



ప్రియదర్శిని ఆశ్రమంలో సంక్రాంతి సంబరాలు

కంబాలచెరువు: భోగిమంటలు, హరిదాసు సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని చెవిటి, మూగ పిల్లల ఆశ్రమంలో పండగ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆశ్రమ ప్రాంగణంలో రంగవల్లులతో, బొమ్మల కొలువుతో బధిర విద్యార్థులు సంక్రాంతి పండగ జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ కరస్పాండెంట్ కె.స్వప్నవర్మ మాట్లాడుతూ పిల్లలకు చిన్ననాటి నుంచే పండల విశిష్టత తెలియజెప్పాలని, అప్పుడే వారు ముందు తరాలకు ఆ ఫలాలను అప్పుడే అందించగలుగుతారన్నారు. ఆశ్రమంలో అన్ని మతాలకు చెందిన పిల్లలు ఉంటారని, వారందరినీ ఒకటిగా చేసి సర్వమత సామరస్యం దిశగా అన్ని పండగులు నిర్వహించి, వాటి విలువలను పిల్లలకు తెలియజేస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ప్రియావర్మ మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను పిల్లలకు తెలియజేస్తున్న ప్రియదర్శిని ఆశ్రమం, వారు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మరో ముఖ్యఅతిథి, బీఎస్ఎన్ఎల్ మాజీ ఉద్యోగి కాకి మణివర్మ మాట్లాడుతూ సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో కాకి నిర్మల, కె.ఆశాలత, ప్రేమలత, నిర్మల, ఎలీషా రాజ్‌కుమార్, ప్రియాంక, శాంతి పాల్గొన్నారు.

ఫిలాంత్రోఫిక్ సొసైటీకి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అద్దంకి రాజయోనా

రాజమహేంద్రవరం రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏలూరులోని వైఎంహెచ్ఏ కళావేదికపై తెలుగు భాష, సంస్కృతి కోసం కృషి చేసే సంస్థలకు, కవులకు, సాహితీ వేత్తలకు ప్రభుత్వం తరపున ప్రతిష్టాత్మక సాహితీ విశిష్ట పురస్కారాలను అందించారు. జిల్లా నుంచి ఫిలాంత్రోఫిక్ సొసైటీని ఎంపిక చేసి జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటూ రూ.ఐదువేలను అందించి ఘనంగా సన్మానించారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ అద్దంకి రాజాయోనాకు పురస్కారాన్ని ముఖ్యఅతిథి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అందించారు.

ఘనంగా కుడార్రై ఉత్సవం

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కుడార్రై ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 108 పాత్రలతో పాయసాన్ని స్వామికి సమర్పించారు.

అర్చక స్వామి అనంతాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు పసుపులేటి రెడ్డిమ్మ, బొండాడ చందు పాల్గొన్నారు.

అందరి సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



కార్యక్రమంలో పాల్గొన్న చక్రవర్తి తదితరులు

కడియం: కడియపు సావరం పంచాయతీ పరిధిలోని సచివాలయం –1లో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి మాట్లాడుతూ అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, పెన్షన్ కానుక, చేయూత, ఆసరా, సున్నా వడ్డీ వంటి వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందుతున్నాయన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ పంచాయతీ పరిధిలో వివిధ రకాల అభివృద్ధి పనుల కింద రూ.11.26 కోట్లు ఖర్చు చేశారన్నారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించి, అనంతరం నాయకులతో కలిసి సచివాలయం సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వైవీఈఎస్ఎస్ లక్ష్మి, సాపిరెడ్డి కామేష్, ఉద్దండ సత్యనారాయణ, జ్యోతుల వీరబాబు, అర్జున్ పాల్గొన్నారు.

ఆ భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతించండి

- నిషేధం తొలగించి ఊరట ఇవ్వండి
- మంత్రి కొట్టును కోరిన ఎమ్మెల్యే రాజా



మంత్రి కొట్టు సత్యనారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా నిషేధ జాబితాలో ఉన్న కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిధిలోని భూములకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలుసుకుని తన విన్నపాన్ని తెలియజేశారు. 2013 నుంచి ఈ భూములకు రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో సంబంధిత రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిషేధాన్ని తొలగించి, క్రయవిక్రయాలకు అవకాశం కల్పించడం ద్వారా ఆయా రైతులకు ఊరటనివ్వాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి కొట్టు సత్యనారాయణ త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు.

గోదాదేవి అమ్మవారికి చీర, సారె



సంపరలో గోదాదేవికి సారె తీసుకొచ్చిన భక్తులు

పెదపూడి: మండలంలోని సంపర వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి అమ్మవారికి భక్తులు చీర, సారె సమర్పించారు. పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సినిమాలు



రాజమహేంద్రవరం
శ్యామల, సూర్యమినీ, సూర్యప్యాలెస్, స్వామి, శివజ్యోతి, ఊర్వశి, రంభ, అప్సర, కుమారి : గుంటూరుకారం
అనుశ్రీ,, రాజా, మేనక : హనుమాన్
అశోక : సలార్

నామవరం
వీఎస్ మహల్ : హనుమాన్

ధవళేశ్వరం
మురళీకృష్ణ : గుంటూరుకారం

కడియం
వెంకటసూర్య : హనుమాన్